అభివృద్ధి చేసేందుకు విజన్ ఉండాలి

- మున్సిపాల్టీల ఏర్పాటును రద్దు చేయాలి
- రూ. 270 కోట్లు రద్దు చేయడం భావ్యం కాదు
- ప్రజల దృష్టి మళ్లించేందుకే కుంటుంబ సర్వే
- ఏం చేశారని సంబురాలు చేస్కుంటరు?
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

కందుకూరు, నవంబర్ 25: రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధిని పూర్తిగా విస్మరించిందని, అభివృద్ధిని చేసేందుకు ఓ విజన్ ఉండాలని, ఆ విజన్ ఉన్న నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వంలో ఒక్కరూ లేరని మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. కందుకూరు మండల కేంద్రంలోని సామ నర్సింహారెడ్డి ఫంక్షన్ హాలులో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే సబితారెడ్డి మాట్లాడుతూ, అభివృద్ధి చేయడానికి నాయకులు ఒక విజన్ ఉండాలని అన్నారు. ఎన్నిల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను దృష్టి మళ్లించడానికే కాంగ్రెస్ ప్రభుత్వం కుంటుంబ సర్వే నిర్వహిస్తుందని, ప్రజా పాలనలో స్వీకరించిన దరఖాస్తులు ఎటుపోయాయి? అని ప్రశ్నించారు. కందుకూరు, మహేశ్వరం, చేవేళ్ల మండలాలను మున్సిపాల్టీలుగా ఏర్పాటు చేస్తున్నారని, ఆ ప్రయత్నాన్ని విరమించుకోవాలని అన్నారు. మున్సిపాల్టీలను ఏర్పాటు చేస్తే అభివృద్ధి కుంటుపడుతుందని ఒక వైపు రైతులు భూములు కోల్పోయి ఇబ్బందులు పడతుంటే మరోవైపు ఉపాధి హామీ కూలీలు పని దొరకక అవస్థలు పడుతారని ఆవేదన వ్యక్తం చేశారు.

రైతులను ఆదుకోవాలి

రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని సబితా ఇంద్రారెడ్డి కోరారు. ఎమ్మెల్యే మండల పరిధిలోని గూడూరు వెళ్తుండగా రైతులు పండించిన ధాన్యాన్ని రోడ్డుపై ఆరబెట్టారు. విషయాన్ని గమనించిన ఆమె రైతుల వద్దకు వెళ్లి మాట్లాడారు. రోడ్డుపై ఎందుకు ఆరబెట్టారని, కొనుగోలు, దిగుబడి, రైతు బంధు వస్తుందా? అన్న విషయాలపై వివరాలు తెలుసుకున్నారు. రైతులు వారి సమస్యలను సబితా ఇంద్రారెడ్డికి వివరించారు. రైతు బంధు రావడం లేదని, కాంగ్రెస్ పార్టీని నమ్మి మోసపోయినట్లు రైతులు పలువురు వివరించారు. కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మన్నే జయేందర్ ముదిరాజ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సురుసాని సురేందర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎలుక మేఘనాథ్ రెడ్డి, సీనియర్ నాయకులు కాకి దశరథ ముదిరాజ్, మహిళా అధ్యక్షురాలు తాండ్ర ఇందిరమ్మ దేవేందర్, గుయ్యని సామయ్య, డైరెక్టరు పొట్టి ఆనంద్, జంగయ్యలు పాల్గొన్నారు.

రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

ప్రతి పక్ష ఎమ్మెల్యేలు ఉన్న చోట్ల ప్రభుత్వం కక్ష సాధింపు ధోరణి అవలంబిస్తుందని తెలిపారు. మాజీ సీఎం కేసీఆర్ నియోజకవర్గం అభివృద్ధికి రూ. 270 కోట్లు మంజూరు చేస్తే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం రద్దు చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనను చూస్తే ప్రజల్లో గందరగోళం నెలకొందని పేర్కొన్నారు. 420 ఎన్నికల హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ప్రజాపాలన అంటే ఇదేనా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో నియంత పాలన కొనసాగుతుందన్నారు. ఏం సాధించారని సంబురాలు చేసుకుంటారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఇచ్చిన హామీలు మాట తప్పినందుకా..? సంబురాలు చేసుకునేది? అని ప్రశ్నించారు. టీఎస్ ఐఐసీ ద్వారా నిధులు తీసుకవచ్చి ఫార్మా సిటీ భూములు కోల్పోయిన గ్రామాలకు రూ.5 కోట్లకు పైగా మంజూరు చేసి అభివృద్ధి చేసినట్లు తెలిపారు.

చివరి ధాన్యం గింజ వరకూ కొనుగోలు చేస్తాం

కలెక్టర్ హనుమంతరావు

పల్లెపహాడ్ కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

తుర్కపల్లి, నవంబర్ 25 : రైతులు పండించిన ధాన్యాన్ని చివరి గింజ వరకూ కొనుగోలు చేస్తామని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. మండలంలోని పల్లెపహాడ్ గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆయన అకస్మిక తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రానికి వచ్చిన ధాన్యాన్ని పరిశీలించారు. కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చిన రైతులకు ఇబ్బందులు కలిగించవద్దని అధికారులు, మిల్లర్లను ఆదేశించారు. రైతుల వివరాలను ఎప్పటికప్పుడు రిజిస్టర్‌లో నమోదు చేయాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటవెంటనే మిల్లులకు పంపాలని సూచించారు. మిల్లర్లు ధాన్యాన్ని త్వరగా దిగుమతి చేసుకోవాలన్నారు. ఆయన వెంట తాసీల్దార్ దేశ్యా ఉన్నారు.

దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలి

బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య

యాదగిరిగుట్ట, నవంబర్ 25 : జిల్లా కేంద్రంలో ఈ నెల 29న నిర్వహించే దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య అన్నారు. పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో అన్న నినాదంతో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ 2009 నవంబర్ 29న నిరవధిక నిరాహార దీక్షకు దిగారన్నారు. అది స్వరాష్ట్ర కల సాకారానికి పునాది వేసిన రోజు అని తెలిపారు. తెలంగాణలో ఒకప్పుడు ఎలాంటి నిర్బంధ పరస్థితులుండెనో నేడు అవే పరిస్థితులు పునరావృతం అయ్యాయన్నారు. ఈ నెల 29న నిర్వహించే దీక్షా దివస్‌తో కాంగ్రెస్ ప్రభుత్వానికి కనువిప్పు కావాలన్నారు. ఆలేరు నియోజకవర్గం నుంచి వేలాది మంది కార్యకర్తలు తరలి రావాలని పిలుపునిచ్చారు. ఎవరెన్ని ఆంక్షలు విధించినా, అరెస్టులు చేసినా భయపడేది లేదన్నారు. కేసీఆర్ ఆనవాళ్లు చెరిపేస్తే చెడిపోయేవి కావని, తరతరాలు గుర్తిండిపోయేలా అభివృద్ధి చేశారని చెప్పారు. సమావేశంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గడ్డమీది రవీందర్‌గౌడ్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు మిట్ట వెంకటయ్య, పట్టణ సెక్రటరీ జనరల్ పాపట్ల నరహరి, నాయకులు బాలరాజుగౌడ్, పేరబోయిన సత్యనారాయణ, ఆరె శ్రీధర్‌గౌడ్, సతీశ్, సాయి, యాకూబ్, చంద్రం, వాసు, వీరేశం, క్రాంతి పాల్గొన్నారు.

మత్స్యగిరి కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ పరామర్శ

సత్తయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిశోర్‌కుమార్

మోత్కూరు, నవంబర్ 25 : మండలంలోని ముశిపట్లలో బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు నెర్లకంటి మత్స్యగిరి తండ్రి సత్తయ్య ఇటీవల మృతిచెందారు. మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ సోమవారం మత్స్యగిరిని పరామర్శించారు. సత్తయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. నివాళి అర్పించిన వారిలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నేవూరి ధర్మందర్‌రెడ్డి, మండలాధ్యక్షుడు పొన్నెబోయిన రమేశ్, నాయకులు చిప్పలపల్లి మహేంద్రనాథ్, బుషిపాక లక్ష్మి, కొండ సోంమల్లు, గజ్జి మల్లేశ్, మత్స్యగిరి, శ్రీనివాస్, నాగరాజు పాల్గొన్నారు.

నిధులు ఉన్నా అభివృద్ధి లేదు

ఆలేరు మున్సిపల్ చైర్మన్ శంకరయ్య

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ శంకరయ్య

ఆలేరు టౌన్, నవంబర్ 25 : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్ రెడ్డి కృషితో ఆలేరు మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.15 కోట్లు కేటాయిస్తే వాటిని ప్రస్తుత ప్రభుత్వం సద్వినియోగం చేసుకోకపోవడం బాధాకరమని మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య అన్నారు. ఆలేరు పట్టణంలో సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కోసం రూ.9కోట్లు, వార్డుల్లో సీసీ రోడ్లకు రూ.3కోట్లు, మున్సిపల్ భవన నిర్మాణానికి రూ.3కోట్లు మొత్తం 15 కోట్ల రూపాయలు మంజూరయ్యాయన్నారు. ఎన్నికల కోడ్ రావడంతో అభివృద్ధి పనులు ఆగిపోయాయని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే కాంట్రాక్టర్‌కు పనులు కేటాయించాలని కోరారు.

దత్తప్పగూడెం వాసికి డాక్టరేట్

జిలకర స్వామి

మోత్కూరు, నవంబర్ 25 : మండలంలోని దత్తప్పగూడేనికి చెందిన జిలకర స్వామికి ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. జంతుశాస్త్రం విభాగంలో కట్ల చేప (కృష్ణబొచ్చె)లో పెరుగుదల ఆహార మార్పిడి సామర్థ్యం, జీవ రసాయన మార్పులపై సోమాటో ట్రోపిన్ హార్మోన్ ప్రభావంపై నిర్వహించిన పరిశోధనను ప్రొఫెసర్ జి.సునీతాదేవి పర్యవేక్షణలో పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. ఇందుకు తనకు ఓయూ డాక్టరేట్‌ను అందజేసిందని చెప్పారు. ప్రస్తుతం ఆయన హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు.

బాలికపై లైంగికదాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు

ఆత్మకూరు(ఎం), నవంబర్ 25 : మండలంలోని ఓ గ్రామంలో బాలికపై లైంగికదాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కృష్ణయ్య సోమవారం తెలిపారు. ఓ యువకుడు బాలిక ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంట్లోకి వెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. బాధితురాలు కుటుంబ సభ్యులకు తెలుపగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి నిందితుని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

సమగ్ర సర్వేలో నమోదు చేయించుకోవాలి

భూదాన్ పోచంపల్లి, నవంబర్ 25 : ఇంటింటి కుటుంబ సమగ్ర సర్వేలో నమోదు చేయించుకోని వారు మండల పరిషత్ కార్యాలయంలో సంప్రదించాలని ఎంపీడీఓ రాపర్తి భాస్కర్ గౌడ్ అన్నారు. సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ మండలంలో సమగ్ర సర్వే 98 శాతం పూర్తయిందన్నారు. నమోదు చేయించుకోనివారు ఉంటే ఎంపీడీఓ కార్యాలయం లోగానీ, ఫోన్ నెంబర్ 9505406757లో గానీ సంప్రదించాలని సూచించారు.

ఎస్ఆర్ లాబొరేటరీస్‌లో మంటలు

చౌటుప్పల్ రూరల్, నవంబర్ 25 : మండలంలోని జైకేసారం గ్రామ పరిధిలోని ఎస్ఆర్ లాబొరేటరీస్ పరిశ్రమలో సోమవారం సాయంత్రం అగ్ని ప్రమాదం సంభవించి దట్టమైన పొగలు వెలువడ్డాయి. ఎస్ఆర్ పరిశ్రమలో భారీ శబ్దంతో దట్టమైన పొగలు అలుముకున్నాయని, దాంతో భయాందోళనకు గురయ్యామని స్థానిక రైతులు తెలిపారు. కొన్ని గంటల పాటు పరిశ్రమ పరిసర ప్రాంతం దట్టమైన పొగలతో నిండిపోయింది. పరిశ్రమ యాజమాన్యం అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వలేదని చౌటుప్పల్ అగ్నిమాపక అధికారి బి.శివాజీ తెలిపారు. రియాక్టర్‌లోని గ్యాస్ లీకేజీ కావడంతో పొగలు అలుముకున్నట్లు సమాచారం.

పశు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

రైతులకు మందులు పంపిణీ చేస్తున్న పశు వైద్య సహాయ సంచాలకులు ఇందిర

రామన్నపేట, నవంబర్ 25 : గ్రామాల్లో నిర్వహిస్తున్న పశు వైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని రామన్నపేట ప్రాంతీయ సహాయ పశు వైద్య సంచాలకురాలు డాక్టర్ ఇందిర అన్నారు. మండలంలోని నీర్నెముల గ్రామంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 156 పశువులకు గాలికుంట వ్యాధి నివారణ టీకాలు వేశారు. 31 దూడలకు నట్టల నివారణ మందులు తాపించారు. అనారోగ్యంతో ఉన్న పశువులను పరీక్షించి మందులు అందజేశారు. పశుసంపద పెంపుదలలో కృత్రిమ గర్భధారణ ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో పశు వైద్య కేంద్రం వైద్యులు డాక్టర్ జ్యోత్స్న, డాక్టర్ వెంకటేశ్, డీఎల్‌డీఏ మహేశ్, సహాయకులు భానుచందర్, మౌనిక, గోపాల మిత్రలు పాల్గొన్నారు.

నిధుల వేటలో.. హెచ్ఎండీఏ

- భారీ ప్రాజెక్టులకు ఆర్థిక వనరులు సమకూర్చుకునే యోచన
- ప్రతిపాదిత ప్రాజెక్టులకు రూ.12 వేల కోట్ల అంచనా వ్యయం

సిటీబ్యూరో, నవంబర్ 25(నమస్తే తెలంగాణ): హెచ్ఎండీఏ ప్రాజెక్టులకు నిధుల కొరత ఏర్పడింది. ప్రాజెక్టులను వేగంగా పట్టాలెక్కించాలంటే ఆర్థిక వనరులు అడ్డు తగులుతున్నాయి. దీంతో హెచ్ఎండీఏ చేపట్టిన కొన్ని భారీ ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు అధికారులు మల్లాగుల్లాలు పడుతున్నారు. ప్రధానంగా ప్రాజెక్టులను పూర్తి చేయడం కంటే ప్రారంభించడమే గగనంగా మారింది. దీంతో గతమెంతో ఘనంగా ఉన్నా హెచ్ఎండీఏ ఇప్పుడు ఆర్థికంగా చితికిపోయింది. దీంతో నిధులు ఉన్నప్పుడే ప్రాజెక్టులు పూర్తి చేసే పరిస్థితులు వస్తాయని హెచ్ఎండీఏ వర్గాల్లో చర్చ నడుస్తోంది.

ఏడు జిల్లాల్లో విస్తరించిన హెచ్ఎండీఏకు గడిచిన పదేళ్లలో ఏనాడు నిధుల సమీకరణ, ఆర్థిక వనరులను సమకూర్చుకోవడం సమస్య కాలేదు. కానీ, గడిచిన ఏడాది కాలంగా పరిస్థితులన్నీ తారుమారయ్యాయి. దీంతో చేపట్టిన ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయలేని దుస్థితి వచ్చింది. ప్రభుత్వం నుంచి అరకొర ఆర్థిక సాయంతో, ఆర్థికంగా స్వయం ప్రతిపత్తి సాధించిన హెచ్ఎండీఏ ఇప్పుడు నిధుల కోసం దిక్కులు చూడాల్సిన వస్తోంది. దీంతో హెచ్ఎండీఏ పరిధిలో చేపట్టిన ప్రతిష్టాత్మక ప్రాజెక్టులతో పాటు సాధారణ పనులను కూడా మొదలుపెట్టే వీల్లేకుండా పోతుంది.

నిధుల కొరతలో హెచ్ఎండీఏ...

ఇటీవల కాలంలో హెచ్ఎండీఏకు వచ్చే ప్రధాన ఆదాయ మార్గాలైన భవన నిర్మాణ అనుమతులు. వీటి ద్వారా మెజార్టీ రెవెన్యూ సమకూరేది. ప్లానింగ్ విభాగం సేకరించే నిధులకు అదనంగా భూముల వేలం, డెవలప్‌మెంట్ యాక్టివిటీలతో హెచ్ఎండీఏ ఖజానా నిండుకునేది. కానీ, పరిస్థితి తలకిందులైంది. వచ్చే ఆదాయం ఏకంగా 50 శాతానికి తగ్గింది. దీంతో నెలవారీ నిర్వహణ, జీత భత్యాలు మినహా కొత్త ప్రాజెక్టులను చేపట్టాలంటే వెనుకంజ వేస్తున్నారు. ప్రధానంగా ప్రతిపాదిత ప్రాజెక్టులను కూడా పూర్తి స్థాయిలో కార్య రూపంలోకి తీసుకు రాలేకపోతున్నారు. మైనర్ పనులకు టెండర్లను ఆహ్వానిస్తున్నా.., నిధుల కొరతతో పూర్తి స్థాయిలో పనులు చేపట్టే అవకాశం లేదని హెచ్ఎండీఏ వర్గాలు చెబుతున్నాయి. గ్లోబల్ సిటీగా నగరాన్ని అభివృద్ధి చేసినప్పుడే, హైదరాబాద్ కేంద్రంగా కొత్త పెట్టుబడులు వస్తాయి. కానీ, ప్రభుత్వం గడిచిన ఏడాది కాలంగా గుర్తించే స్థాయిలో ఏ ఒక్క ప్రాజెక్టును చేపట్టలేదు. కనీసం శంకుస్థాపన చేసిన రెండు ఎలివేటెడ్ కారిడార్ పనులను కూడా ఇప్పటివరకు పట్టా లెక్కించలేదు. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం భూసేకరణతో కలిపి మొత్తం రూ.10 వేల కోట్లు దాటుతుండగా, మరో రూ.2 వేల కోట్లతో ప్రాజెక్టులు నిర్మాణ దశలో ఉన్నాయి. దీంతో భారీ స్థాయిలో నిధులు సమకూరితే తప్పా, ప్రాజెక్టులను మొదలుపెట్టే పరిస్థితి లేకుండా పోయింది. ఇప్పటికీ కొత్వాల్‌గూడ ఎకో పార్క్ పనులు జరుగుతుండగా, మరోవైపు మీరాలం చెరువుపై ప్రతిపాదిత కేబుల్ బ్రిడ్జి నిర్మాణం కూడా ఇప్పట్లో మొదలయ్యేలా లేదు. దీంతో పాటు ఏరియల్ రోడ్ల నిర్మాణం కూడా పెండింగ్‌లోనే ఉంది.

గ్రేటర్‌లో తుది దశకు ఇంటింటి సర్వే

- 78.53 శాతం మేర సర్వే పూర్తి

సిటీబ్యూరో, నవంబరు 25(నమస్తే తెలంగాణ): గ్రేటర్ పరిధిలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే తుది దశకు చేరుకున్నది. సోమవారం నాటికి 78.53 శాతం సర్వే పూర్తయ్యిందని అధికారులు తెలిపారు. ఇప్పటి వరకు 19,04,977 కుటుంబాల సర్వే పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. ఈ సర్వే డేటా ఎంట్రీ ప్రక్రియ సర్కిల్ వారీగా చేపడుతుందని, డేటా నమోదు సమయంలో ఎక్కడా పొరపాట్లు జరగకుండా, కోడింగ్ సరియైన విధంగా ఉండేలా చూడాలని అధికారులు సూచించారు. కుటుంబ డేటా ఎంట్రీని ఆన్‌లైన్‌లో సజావుగా, నిశితంగా నమోదు చేయాలని సూచించారు. సర్వే పూర్తయిన ఫారాలను భద్రంగా నిల్వ చేయాలని, ఒక్క ఫారం కూడా బయట కనిపించకుండా ఉండేలా అన్ని ఫారాలను స్ట్రాంగ్ రూంలలో భద్రపర్చాలని డిప్యూటీ కమిషనర్లు ఆదేశించారు.

తెలుగు వర్సిటీ నూతన రిజిస్ట్రార్‌గా ఆచార్య హనుమంతరావు

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం లలిత కళాపీఠం, రంగస్థల కళల శాఖలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఆచార్య కోట్ల హనుమంతరావును నూతన రిజిస్ట్రార్‌గా వీసీ ఆచార్య నిత్యానంద రావు నియమించారు. ఈ మేరకు వీసీ సోమవారం తన చాంబర్‌లో నియామకం పత్రాన్ని హనుమంతరావుకు అందజేశారు. – తెలుగు యూనివర్సిటీ

శ్రీకాంతాచారి వర్ధంతికి రావాలని మంత్రికి ఆహ్వానం

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న కాసోజు శంకరమ్మ

మోత్కూరు, నవంబర్ 25 : మండలంలోని పొడిచేడు గ్రామంలో డిసెంబర్ 3న నిర్వహించే తెలంగాణ మలి దశ ఉద్యమ తొలి అమరుడు కాసోజు శ్రీకాంతాచారి 15వ వర్ధంతికి రావాలని రాష్ట్ర నీటి పారుదల, పౌరసరఫరాల శాఖల మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మ ఆహ్వానించారు. హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో సోమవారం కలిశారు. అదేవిధంగా రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంను కలిసి ఆహ్వాన పత్రికలు అందజేశారు.

మున్సిపాలిటీలో కుటుంబ సర్వే 98శాతం పూర్తి

భువనగిరి మున్సిపల్ కమిషనర్ రామానుజులరెడ్డి

భువనగిరి అర్బన్, నవంబర్ 25 : పట్టణంలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే 98శాతం పూర్తయిందని మున్సిపల్ కమిషనర్ పి.రామానుజులరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని ఇండ్ల వద్దకు సర్వే నిర్వహణకు సంబంధించిన అధికారులు రాకున్నా, జనం అందుబాటులో లేకున్నా, ఇంటికి తాళం వేసి ఉన్న సందర్భంలో సర్వేలో నమోదు కాని కుటుంబాల వివరాలను నమోదు చేసుకొనుటకు సహకరించాలని కోరారు. సర్వేలో నమోదు కాని కుటుంబాల వివరాల నమోదు కోసం మున్సిపాలిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫోన్ నంబర్ 9000617727లో సంప్రదించాలని సూచించారు.

సమగ్ర సర్వేలో వంద శాతం నమోదుకు సహకరించాలి

బీబీనగర్, నవంబర్ 25 : సమగ్ర సర్వేలో వంద శాతం కుటుంబాల నమోదుకు ప్రజలు సహకరించాలని ఎంపీడీఓ వై.శ్రీనివాస్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలో సుమారు 98 శాతం సర్వే పూర్తయిందని తెలిపారు. సర్వేలో నమోదు కాని వారు సంబంధిత గ్రామపంచాయతీ కార్యదర్శికి లేదా సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నోడల్ అధికారి/ ఎంపీడీఓ కార్యాలయ పర్యవేక్షకుడిని 7331146017లో లేదా ప్రత్యక్షంగా సంప్రదించాలని సూచించారు.

డాటా ఎంట్రీని పకడ్బందీగా నిర్వహించాలి : ఎంపీడీఓ



చౌటుప్పల్ రూరల్ : దండు మల్కాపురం గ్రామంలోని అశోకా ఇంజినీరింగ్ కళాశాలలో డాటా ఎంట్రీని పరిశీలిస్తున్న ఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి

తుర్కపల్లి, నవంబర్ 25 : సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే డాటా ఎంట్రీని పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీఓ ఝాన్సీలక్ష్మీబాయి అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహిస్తున్న డాటా ఎంట్రీని సోమవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 40 కంప్యూటర్ల ద్వారా డాటా ఎంట్రీ చేస్తున్నట్లు తెలిపారు. ఆపరేటర్లు తప్పులు లేకుండా ఎన్యూమరేటర్ల సహకారంతో పూర్తి సమాచారాన్ని కంప్యూటర్లలో నమోదు చేయాలన్నారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ఈ నెల 26తో ముగుస్తుందని తెలిపారు. ఇప్పటి వరకు సర్వే చేయించుకోనివారు సంబంధిత గ్రామ పంచాయతీ లేదా ఎంపీడీఓ కార్యాలయంలో వివరాలు ఇచ్చి సర్వే చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్ వినోద్‌రెడ్డి, మాస్టర్ ట్రైనర్లు అశోక్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కులగణన డాటా ఎంట్రీ పరిశీలన

చౌటుప్పల్ రూరల్ : మండలంలోని దండు మల్కాపురం గ్రామ పరిధిలోని అశోకా ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కులగణన డాటా ఎంట్రీని ఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. డాటా ఎంట్రీని త్వరగా పూర్తి చేయాలని, డాటా ఎంట్రీలో ఎటువంటి పొరపాట్లు లేకుండా జాగ్రత్త వహించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సందీప్‌కుమార్, ఎంపీఓ అంజిరెడ్డి, ఏఎస్ఓ పవన్ పాల్గొన్నారు.

ఆలేరు రూరల్ : మండల పరిషత్ కార్యాలయంలో చేపడుతున్న ఆన్‌లైన్ డాటా ఎంట్రీని మండల ప్రత్యేకాధికారి గోపాల్ సోమవారం పరిశీలించారు. తప్పులు లేకుండా జాగ్రత్తగా డాటా ఎంట్రీ చేయాలని ఆపరేటర్లకు సూచించారు. ఇప్పటి వరకు 98శాతం సర్వే పూర్తయినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సత్యాంజనేయప్రసాద్, ఏఎస్ఓ మహేశ్, డాటా ఎంట్రీ ఆపరేటర్లు పాల్గొన్నారు.

యువజనంతోనే వారసత్వ పరిరక్షణ

- పలువురు చరిత్రకారులు

సిటీబ్యూరో, నవంబర్ 25(నమస్తే తెలంగాణ): యువతతోనే వారసత్వ సంపద పరిరక్షణ సాధ్యమని, బాధ్యతాయుతంగా పౌర సమాజంలో భాగస్వామ్యం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు చరిత్రకారులు అన్నారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ హెరిటేజ్ తెలంగాణ, డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ ఆధ్వర్యంలో వరల్డ్ హెరిటేజ్ వీక్ సెలబ్రేషన్స్ కార్యక్రమాలను నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో భాగంగా సోమవారం పలువురు పాల్గొన్నారు. గ్రాడ్యుయేట్ ఆర్కిటెక్చర్ విద్యార్థుల కోసం 'పునరుజ్జీవన వారసత్వం – ముదుమల్ మెగాలిథిక్ మెంహిర్స్' పేరుతో డిజైన్ పోటీలను నిర్వహించారు. జేబీఆర్ ఆర్కిటెక్చర్ కాలేజీ కార్యక్రమాలను నిర్వహించగా, ఎస్వీ కాలేజ్ ఆఫ్ ఆర్కిటెక్చర్, జేఎన్ఏఎఫ్‌యూ, ఓయూ ఆర్కియాలజీ విద్యార్థులు, ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ హైస్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. హెరిటేజ్ తెలంగాణ శాఖ డైరెక్టర్ ఎస్.శ్రీధర్ సెంటినరీ హెరిటేజ్ మ్యూజియం, బౌద్ధుల సైట్ మ్యూజియం, ఫణిగిరి పేరిట రెండు బ్రోచర్లను విడుదల చేశారు. వారసత్వ పరిరక్షణలో విద్యావేత్తలు, స్థానిక సంస్థలు భాగస్వామ్యం కావాలని, ప్రధానంగా యువత రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలు, వారసత్వ మూలాలను పరిరక్షించేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ చైర్మన్ వేద కుమార్, డైరెక్టర్ నారాయణ, డిప్యూటీ డైరెక్టర్ నాగరాజ్, హెరిటేజ్ తెలంగాణ విభాగం, ఫ్లీచ్ ఇండియా సీఈఓ డా. శివనాగిరెడ్డి, ఇంటాక్ న్యూఢిల్లీ సభ్యులు డా. దీపేంద్ర శర్మ, కోటయ్య వింజమూరి, ఏఎస్ఐ అసిస్టెంట్ ప్రొ. జయశ్రీ, ఇంటాక్ హైదరాబాద్ చాప్టర్ కన్వీనర్ పి.అనూరాధా రెడ్డి పాల్గొన్నారు.

వియత్నాం అమ్మాయి.. తెలంగాణ అబ్బాయి ఒక్కటయ్యారు..

చండూరులో రిజిస్టర్ మ్యారేజ్

రిజిస్టర్ మ్యారేజ్ చేసుకుంటున్న సందీప్, నీనా

చండూరు, నవంబర్ 25 : వియత్నాం అమ్మాయి తెలంగాణ అబ్బాయి ఒక్కటయ్యారు. నల్లగొండ జిల్లా చండూరు మున్సిపాలిటీకి చెందిన పాంపాటి భాస్కర్ శోభ దంపతుల మొదటి కుమారుడు పాంపాటి సందీప్ 2017లో ఉద్యోగరీత్యా వియత్నాం వెళ్లి ఇన్‌వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ రంగంలో ఉద్యోగం చేస్తూ, అక్కడే హోటల్ స్థాపించి వ్యాపారం చేస్తూ స్థిరపడ్డాడు. కొద్ది రోజులుగా వియత్నాంకు చెందిన యూత్ మినిస్ట్రీ సెక్రటరీగా ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్న అమ్మాయి నీనా పరిచయం కావడం, పరిచయం కాస్త ప్రేమగా మారింది. దీంతో అమ్మాయి అక్కడి ఉద్యోగానికి రాజీనామా చేసింది. సందీప్‌తో వివాహనికి ఇండియా వచ్చింది. వారు చండూరు మండల కేంద్రంలోని సబ్ రిజిస్టర్ కార్యాలయంలో సోమవారం రిజిస్టర్ మ్యారేజ్ చేసుకున్నారు.

'మాలల సింహగర్జనను జయప్రదం చేయాలి'

వలిగొండ, నవంబర్ 25 : హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో డిసెంబర్ 1న నిర్వహించే మాలల సింహగర్జన సభను జయప్రదం చేయాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు కుసంగుల రాజు అన్నారు. మండల కేంద్రంలో సోమవారం సింహగర్జన పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మాలలు అధిక సంఖ్యలో తరలివచ్చి సభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు దొంత సత్యం, పెరుమాండ్ల యాదగిరి, రాపోలు పవన్‌కుమార్, శేఖర్, కృష్ణ, రఘుపతి, రామలింగం, గోపి, సురేశ్ పాల్గొన్నారు.